ప్రజాశక్తి
బుధవారం 15 ఫిబ్రవరి 2023



నాలుగో వారం తరగని భక్తజనం

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గత మూడు వారాలు జాతర మాదిరిగానే ఈ జాతరలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వనం, చదురు గుడిలో భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. సాలూరు సిఐ ధనుంజయరావు, ఎస్ఐ పైడిరాజుల పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు సరిపడా లడ్డూ ప్రసాదాలను దేవాలయశాఖ అందుబాటులో ఉంచింది. ప్రత్యేక బస్సుల్లేకపోయినప్పటికీ పెద్దఎత్తున భక్తులు రాకతో శంబర నిండుగా దర్శనమిచ్చింది.

భయంకరి

సుమారు 16 ఏళ్ల క్రితం ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతానికి 2006లో వచ్చిన ఏనుగుల గుంపు నేటికీ ఈ ప్రాంతాన్ని వీడలేదు. వందలాది ఎకరాల పంటలను నాశనం చేస్తూ, సుమారు 15 మందిని బలితీసుకున్నాయి. ఏనుగులను తరలించే క్రమంలో, వివిధ కారణాల రీత్యా పలు ఏనుగులు చనిపోగా, మరికొన్ని వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయాయి. ప్రస్తుతం కురుపాం నియోజకవర్గంలోని జియమ్మ వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఉన్న నదీ ప్రవాహక ప్రాంతాల్లో ఏడు ఏనుగులు జనావాసాల మధ్య సంచరిస్తూ జన జీవనానికి తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నాయి. తాజాగా భామిని, సీతంపేట ప్రాంతంలో కూడా సంచరిస్తున్నాయి.



కొండపై సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)

- వీడని ఏనుగుల బెడద
- దాడిలో ఇప్పటి వరకు 15 మంది మృతి
- నెల రోజుల వ్యవధిలో ముగ్గురు దుర్మరణం
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు



ఏనుగులదాడిలో మరణించిన ట్రాకర్ (ఫైల్)

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో గత కొన్నేళ్లగా ఏనుగుల సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. అటు పంట నష్టం, ఇటు ప్రాణ నష్టం జరుగుతుండడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా బలిజిపేట మండలం చెల్లింపేటలో మంగళవారం తెల్లవారి ఓ వృద్ధుడిపై దాడి చేసి చంపేశాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల దాడిలో గత 16 ఏళ్లలో ఇప్పటివరకు సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మత్యువాత పడ్డారు. అయినా అటు అధికారులు, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అడవుల్లో ఉండవలసిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వ నాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణానికి ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. ఇదిలా ఉండగా భామిని మండలం లో గత కొన్నేళ్లు నుంచి నాలుగు ఏనుగులు ఉండగా, నేరడి బ్యారేజ్ సమీపంలో మరో ఆరు ఏనుగుల గుంపు రావడం కలకలం రేపింది. దీంతో వీటి సంఖ్య పదికి చేరింది. మరోవైపు బలిజిపేట మండలంలో కూడా ఏనుగుల గుంపు దాడులు చేస్తూ పలువు రిని పొట్టన పెట్టుకుంటున్నాయి. ఏనుగులను తరలించే ప్రయత్నంలో కొద్దిరోజుల క్రితం కాలంలో భామిని సమీపంలో ఒక ట్రాకర్ కూడా మత్యువాత పడ్డాడు.

విఫలమైన ఆపరేషన్ గజ

అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఉన్న అడవి ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించేందుకు ఆపరేషన్ గజ కార్యక్రమానిన ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చేపట్టారు. తమిళనాడు నుంచి ట్రైనింగ్ పొందిన జయంతి అనే మగ ఏనుగును తీసుకువచ్చి అడవి ఏనుగులు గుంపును తరలించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా అది పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. దీంతో ఆ కార్యక్రమానికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది.

ప్రాణాలు తీసేస్తున్నాయి..

ఏనుగుల దాడి లో సుమారు 15 మంది వరకు మతి చెందడం ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఏనుగులు రోజుకొకరిపై దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగులు తొలిసారిగా బొడ్లగూడ సమీపంలో శాంతమ్మ గిరిజన మహిళను తొక్కి చంపేశాయి. ఈ సంఘటన జరిగిన వారం లోపే లుంబేసు పంచాయతీ వాడబాయి సమీపంలో ఉన్న కొండ పాక వద్ద ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వృద్ధులను, ఒక చిన్నారిని పొట్టన పెట్టుకున్నాయి. అదే క్రమంలో ఇరిడి గ్రామ సమీపంలో పెద్ద గూడ గ్రామానికి చెందిన గిరిజన వ్యక్తిని, చెముడు గూడ పంచాయతీ అడ్డం గూడ గ్రామానికి చెందిన బిడ్డిక సొంప అనే వృద్ధురాలు గెడ్డకి వెళ్లి వస్తుండగా గ్రామ సమీపంలోనే దాడి చేసి చంపాయి. వీరఘట్టం మండలం హుస్సేన్ పురంలో న్యూస్ కవరేజ్ కి వెళ్లిన విలేకరిపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. ఇటీవల భామిని మండలం ఘనసర వద్ద చిన్నారావు అనే రైతును, ఏనుగులను తరలించే క్రమంలో పసుకుడి గ్రామ సమీపంలో ఎలిఫెంట్ కేర్ ట్రాకర్ లోకుండ లక్ష్మీనారాయణను పొట్టన పెట్టు కున్నాయి. ఇది మరువకముందే బలిజిపేట మండలం చెల్లింపేట గ్రామంలో అడప దేశినాయుడు అనే వద్దుడు పై ఏనుగులు దాడి చేసి ప్రాణాలు తీశాయి. జియమ్మ వలస, కొమరాడ మండలాల్లో కూడా పలువురుపై దాడి చేసి ప్రాణాలు తీయడమే కాకుండా, రైతులు పండించుకున్న పంటలను, వాటర్ మోటార్లను, అంగన్వాడీ భవనం తలుపులు ధ్వంసం చేశాయి.

ఏనుగులను తరలించాలి



మన్యం జిల్లాలో ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి ఒడిశా ప్రాంతానికి తరలించే విధంగా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఏనుగుల దాడితో విలువైన ప్రాణాలు, పంట నష్టం, ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

- కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ప్రజలను కాపాడాలి



పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న అడవి ఏనుగుల గుంపు బారి నుంచి ప్రజలను ప్రభుత్వం కాపాడే చర్యలు చేపట్టాలి. ఏనుగుల సంచారంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

- తోయక జగదీశ్వరి, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

మన్యం జిల్లాలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం పార్వతీపురం పరిసర ప్రాంతం , కొమరాడ మండలం అర్తం, సాలూరు మండలం జంతి కొండ పరిసర ప్రాంతాలలో ఎలిఫెంట్ జోన్ కోసం బృంద సభ్యులు పరిశీలన చేయడం జరిగింది. ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు సుమారు రూ.70 కోట్ల అవసరం ఉంటుంది. కేంద్రం నుంచి అనుమతులు వస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుంది.

- రాజా బాబు, కురుపాం అటవీ శాఖ రేంజర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలు చేస్తున్నాం : కలెక్టర్

శతశాతం ఇ-క్రాప్, ఇ- కెవైసీ నమోదు చేయించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాకు 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా, ఇప్పటికే 2.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, కావున రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టరు నిశాంత్ కుమార్ అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యాన వన, పశు సంవర్ధక, మత్స్యశాఖల్లో అమలవుతున్న పథకాల పురోగతిని కలెక్టరు సమీక్షించారు. ఇకెవైసి చేయించేందుకు నెట్వర్క్ లేని ప్రాంతాలపై దృష్టి సారించి, వారిని మైదాన ప్రాంతానికి తీసుకొచ్చి ఇకెవైసి పూర్తిచేయాలన్నారు. నూరు శాతం ఇ-క్రాప్, ఇ- కెవైసి నమోదు చేయించాలని, లేనిచో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీకి సంబంధించి ఇ-పంట నమోదు పూర్తిచేయాలని, విఆర్ఒఒ, విఎఎలచే ఆథరైజేషన్ చేయించాలని అన్నారు. జిల్లాలో మొదటి విడతగా రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న 142 కస్టమర్ హైరింగ్ సెంటర్లకు అవసరమగు పరికరాలు అందించాలన్నారు. మత్స్యశాఖకు సంబంధించి లక్ష్యం 68 యూనిట్లకు వెంటనే రుణం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు విస్తరించాలి

జిల్లాలో బ్యాంకింగ్ సేవలు విస్తరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఆర్థిక సేవలందించడం, ఆర్థిక అక్షరాస్యత కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. గిరిజనులకు బ్యాంకింగ్ సేవలు మరింత వేగంగా విస్తతం కావాలన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు విస్తృతం చేయడంతో పాటు ఆర్థిక నేరాలు జరగకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. యువతను బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవడంలో భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రైవేట్ వ్యక్తులను గిరిజనులు, రైతులు రుణాలకు ఆశ్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అటవీ ఉత్పత్తులు, ఇతర పంటల సాగుకు, ఆర్ఒఎఫ్ఆర్ భూములకు, విద్యా, పశు సంవర్ధక యూనిట్లకు రుణాలు అందించాలన్నారు. సమావేశంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎఎ హసీబ్, రిజర్వ్ బ్యాంకు ఎజిఎం ఎ.నాగప్రవీణ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎ.. ఈశ్వర రావు, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, డిఆర్‌డిఎ పి.డి పి. కిరణ్ కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం, శ్రీకాకుళం డిసిసిబి సిఇఒ వరప్రసాద్, బ్యాంకుల నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై దృష్టిపెడతా : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం 4వ వార్డులో పర్యటించారు. రహదారి సమస్య కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. కాలనీ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావును కోరారు. అదే విధంగా ఆస్పత్రి నుంచి కాలనీకి ఆనుకుని ఉన్న రహదారి వినియోగంలోకి తీసుకురావాలని ఆస్పత్రి సూపరింటిండెంట్ నాగభూషణరావుతో చర్చించారు. ఆయనతో పాటు నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కమిషనర్ సర్వేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ గంగునాయుడు, పాలవలస దవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, కోరాడ రవి ఉన్నారు.

ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల నోడల్ అధికార్ల నియామకం జిల్లాలో చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సిబ్బంది యాజమాన్యం (మేన్ పవర్ మేనేజిమెంట్) నోడల్ అధికారిగా జిల్లా ఆర్థిక ప్రణాళిక అధికారి, రవాణా యాజమాన్య నోడల్ అధికారులుగా జిల్లా రవాణా అధికారి, జిల్లా ప్రజా రవాణా అధికారి, శిక్షణా యాజమాన్య నోడల్ అధికారులుగా పాలకొండ సబ్ కలెక్టర్, పార్వతీపురం ఆర్‌డిఒ, మెటీరియల్ మెనేజిమెంట్ నోడల్ అధికారిగా డిపిఒ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా పార్వతీపురం ఐటిడిఎ పిఒ, ఎన్నికల పర్యవేక్షకుల నోడల్ అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి, బాలెట్ పేపర్ నోడల్ అధికారిగా డిఎస్ఒ, మీడియా సెల్ నోడల్ అధికారిగా డిపిఆర్ఒ, హెల్ప్ లైన్, కంప్లైంట్స్ పరిష్కారం నోడల్ అధికారిగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, లైవ్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారిగా డిఆర్‌డిఎ పిడి, కంప్యూటరైజేషన్, పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరా, వెబ్ కాస్టింగ్, సాఫ్ట్ వేర్ తదితర అంశాల నోడల్ అధికారులుగా ఇడిఎం, ఎన్.ఐ.సి, హ్యాండ్ హోల్డింగ్ వ్యక్తులు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

శాసనమండలి ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని డిఆర్ఒ జె.వెంకటరావు కోరారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశామని, గతంలో కంటే ఓటర్లు పెరిగినందున పోలింగు స్టేషన్ల సంఖ్యను పెంచామని తెలిపారు. పోలింగు స్టేషన్లలో నాలుగు కేంద్రాల పేర్లు మాత్రమే మార్పు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి, సప్లిమెంటరీ లిస్టు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఓటరు లిస్టులో చేర్పులు, ఫిర్యాదుల మేరకు డూప్లికేట్, అనర్హుల తొలగింపు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు. హెచ్ - సెక్షను సూపరింటెండెంటు డి.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బలిజిపేట మండలం చెల్లంపేటలో ఏనుగులు దాడిలో మరణించిన పరదేశి నాయుడు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని పలు రాజకీయ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తీసుకువచ్చిన మృతదేహాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పరిశీలించి, బంధువులను పరామర్శించారు.

నష్టపరిహారం రూ.25 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

బలిజిపేట : ఏనుగుల దాడిలో మృతి చెందిన వృద్ధుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని శివరాంపురం పంచాయతీ చెల్లింపేటలో మృతి చెందిన పరదేశినాయుడు కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండలంలో ఏనుగుల సంచరించి లక్షలాది రూపాయలు పంట నష్టం చేశాయని, మిర్తివలసలో పశువులను, ఇప్పుడు వృద్ధుడిని చంపేశాయని అన్నారు. కావున ఏనుగులను వెంటనే జిల్లా నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడు, గేదెల సత్యనారాయణ, గంట్యాడ బలరాం నాయుడు, కడప జ్యోతి ఉ ఉన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి : జనసేన

చెల్లింపేటలో వృద్ధుడిపై జరిగిన ఏనుగుల దాడిని ఖండిస్తూ ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వాహన కార్యదర్శి గంట్యాడ సోమినాయుడు విమర్శించారు. అధికార పార్టీ నిర్లక్ష్యం వల్ల వ్యక్తి మృతి చెందాడన్నారు. యుద్ధప్రాతిపదికన ఏనుగులను తరలించాలని, మృతుడి కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి

న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - భామిని

కొత్తూరు మండలం పూతికవలస గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువున్న కొండగొర్రి పవిత్ర (16) అనారోగ్యంతో మరణించిందని, ఆమె మృతికి ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్యమేనని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. పవిత్ర తల్లిదండ్రులు కొండగొర్రి కేదార్, మాయంతి, గిరిజన సంఘాలు, స్థానిక గిరిజనులు దిమ్మిడిజోల, బాలేరు గ్రామాల మధ్య గల ప్రేమగిరి కూడలి వద్ద మృతదేహాన్ని ప్రధాన రహదారిపై ఉంచి మంగళవారం బాధితులకు న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేశారు. దీంతో సుమారు 2 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో బాలేరు వస్తున్న సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ వాహనాన్ని నిలిపి పవిత్ర కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వసతి గృహంలో అధికారుల పర్యవేక్షణ లేదని, 500మంది విద్యార్థినిలు ఉంటే కనీసం ఒక జిఎన్ఎం లేదని, విద్యార్థిని పవిత్ర ఆరోగ్యం వసతిగృహంలో క్షీణించిన తర్వాతే తల్లిదండ్రులకు తెలిపారని అన్నారు. పవిత్రను తల్లిదండ్రులు సీతంపేట ఆసుపత్రిలో చేర్చిన తర్వాత వసతి గృహ సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదన్నారు. సంఘాల ఒత్తిడి నేపథ్యంలో సోమవారం సీతంపేట నుంచి విశాఖకు తరలించే క్రమంలో మార్గమధ్యలో పవిత్ర చనిపోయిందని అన్నారు. పేదరికంలో ఉన్న పవిత్ర కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని, ఆమె ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరావు సబ్‌కలెక్టర్‌ను కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, పవిత్ర మృతిపై కమిటీ వేసి దర్యాప్తు చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని, ఉద్యోగం అంశంపై ఐటిడిఎ పిఒకు సూచిస్తామని, అవకాశంఉంటే ఐటిడిఎ ద్వారా ఫైనాన్స్ ఏర్పాటు చేస్తామని, ఈ అంశం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన నిలిపివేశారు. కార్యక్రమంలో బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, గిరిజన సంఘం మండల కార్యదర్శి కొండగొర్రి భాస్కరరావు, అధ్యక్షులు కొండల ప్రసాద్, గిరిజన సంఘం సభ్యులు కొండగొర్రి నూకయ్య, బిడ్డిక గంగన్న, గిరిజనులు ఉన్నారు.



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం : జిల్లాలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మరణాల నివారణకు ఐటిడిఎ, వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో వరుస మరణాలు జరుగుతున్న అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కోరారు.

విద్యార్థుల మరణాలకు పరిష్కారం లేదా?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ రకాలైన అనారోగ్య కారణాల వల్ల మృత్యువాతపడడం బాధాకరమని, వీరి మరణాలకు పరిష్కారం లేదా అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. గిరిజన విద్యార్థి కోలక సుమిత్ర మృతి చెందిన నేపథ్యంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోతే హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా వస్తుందని, ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి ఎలా పెరుగుతుందని. ప్రశ్నించారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టు ఖండించాలి


సాలూరు : కృష్ణా జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మంగళవారం మండల కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మండలకార్యదర్శి వరుణ్ ఆధ్వర్యాన విద్యార్థులు బంగారమ్మపేట పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని చెప్పారు. విద్యార్థి నాయకుడు పవన్ బట్టలూడదీసి పోలీసులు దాడి చేయడం దారుణమని అన్నారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఫేస్‌యాప్‌లను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామ రెవెన్యూ సహాయకులకు నష్టం చేసే ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద విఆర్ఎలు ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి మన్మధరావు మాట్లాడుతూ విఆర్ఎల ఉద్యోగాలకు ఎసరుపెట్టే ఎపి ఎఫ్ ఆర్ ఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, డిఎతో కలిపి వేతనం చెల్లించాలని, నామినీలను విఆర్ఎలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్ ఇవ్వాలి, 65 ఏళ్లుదాటి చనిపోయిన విఆర్ఎ కుటుంబంలో కంపాసినేట్ గ్రౌండ్ కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సాంప్రదాయాలకు భిన్నంగా ఇచ్చిన డిఎను వేతనం నుండి రికవరీ చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే డిఎ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించుకొని డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలన్నీ విఆర్ఎలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, కోశాధికారి జి.వెంకటరమణ, విఆర్ఎ సంఘం కార్యదర్శి కృష్ణ, గోపి, వి.సూరయ్య, సుదర్శన, విజయ్, పుష్ప తదితర విఆర్ఎలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

ఇసుక ర్యాంప్ పరిశీలన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బిల్లుమడ, బాలేరు మధ్య నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుత ఒడిశా అనుమతితో వంశధారనదిపై ఆంధ్రా ఒడిశా సరిహద్దులో నిర్వహిస్తున్న ర్యాంపు అనుమతి పరిశీలించి, ఒడిశా అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. అనంతరం ఇసుక తరలింపునకు వేసిన రోడ్డు రూట్ పర్మిషన్ ఎలా చేశారన్న అంశాలను తహశీల్దార్ అప్పారావు, సర్వేయర్ రాంమోహన్ అడిగి, రోడ్డు అనుమతి అంశాలను పరిశీలించారు. ఇంకా కొన్ని అంశాలు పరిశీలించాల్సి వుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, వైసిపి నాయకులు కొవ్వాడ ఆంజనేయులు, మెడిబోయిన చలపతిరావు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో ఆమె 'పసిడి' రాజు

ప్రజాశక్తి - సాలూరు

ఇద్దరు పిల్లల తల్లి అయినా ఆమె పరుగుపందెంలో పసిడి రాజు. అథ్లెటిక్స్ లో అడుగు పెడితే బంగారు పతకం ఆమెదే. మండలంలోని మొకాసా మామిడిపల్లి గ్రామానికి చెందిన కనకల పైడిరాజు త్వరలో శ్రీలంకలో జరుగనున్న మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పశ్చిమ బెంగాల్ మిడ్నాపూర్‌లో నిర్వహించిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న పైడిరాజు 400, 800, 500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించారు. పైడిరాజు మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో క్రీడల పట్ల ఆసక్తి కనబరిచారు. అప్పటి వ్యాయామ క్రీడా ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు వద్ద మెలుకువలు నేర్చుకుని నేడు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పైడిరాజు ప్రస్తుతం విశాఖలోని గీతం డెంటల్ కాలేజ్‌లో ఎఎన్ఎంగా పని చేస్తున్నారు. భర్త గణపతి ప్రోత్సాహంతో పనిచేస్తున్న సంస్థ సహకారంతో ఆమె అథ్లెటిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడలకు వయసు అడ్డంకి కాదని ఆమె నిరూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అప్పటి గురువు పొట్నూరు శ్రీరాములు నేర్పిన మెలుకువలతో తాను ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. భర్త గణపతి ప్రోత్సాహం, గీతం డెంటల్ కాలేజ్ యాజమాన్యం సహకారం తన ఎదుగుదలకు బాగా ఉపయోగపడ్డాయని పైడిరాజు చెప్పారు.



జాతీయ అథ్లెటిక్స్‌లో బంగారుపతకాన్ని అందుకుంటున్న పైడిరాజు (ఫైల్)

పారమ్మ కొండపైకి తాగునీటి సరఫరాకు చర్యలు

సాలూరు : పాచిపెంట మండలం చీపురువలస సమీపంలో ఉన్న పారమ్మ కొండ పై మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే జాతర ఘనంగా జరపడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. పారమ్మ భక్తులు, హైందవ ధర్మసేన సభ్యులు మహాశివరాత్రి రోజున జాగరణ, పూజలను విజయవంతం చేయాలని భావిస్తున్నారు. దీనిలో భాగంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. కొండ కింద నుంచి పైకి నీటిని పైపులైన్ ద్వారా తీసుకుని వెళ్లేందుకు గత కొద్దిరోజులుగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట : మండలంలోని నాయుడు మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను డైట్ ప్రిన్సిపాల్ తిరుమల చైతన్యం పాలకొండ డిప్యూటీ విజయకుమారి సందర్శించారు. మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు వర్క్ బుక్‌లను తనిఖీ చేశారు. పాఠ్యప్రణాళికలు పరిశీలించారు. లిప్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎ-గ్రేడ్‌లో ఉన్నట్టు పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతానగరం : మార్చి 16న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలకు తహశీల్దార్ ఎంవి రమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రసన్న లక్ష్మితో చర్చించి పోలింగ్ కేంద్రానికి కనీస సౌకర్యాల కోసం అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు అన్ని వసతులు ఉండాలని, అందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు విఆర్‌ఒ పి.కుమారస్వామి ఉన్నారు.

బర్లిలో పొలంబడి

బలిజిపేట : మండలంలోని బర్లిలో పొలంబడి కార్యక్రమం మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రావణ్ కుమార్ ఆరోగ్యకరమైన పంట సాగుపై మెళకువలను వివరించారు.. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

పాఠశాల పరిశీలన

బలిజిపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కేంద్ర బృందం మంగళవారం వివిధ అంశాలపై పరిశీలించింది. డైట్ లెక్చరర్, లిప్ కోఆర్డినేటర్ సందర్శించి బోధన, బోధనేతర సిబ్బంది కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. బోధనా విధానంలో భాగంగా పైడపునాయుడు, రాజారావు బోధనలు పరిశీలించి అభినందించారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

గుమ్మలక్ష్మీపురం : 14 ఏళ్లలోపు బాలలచే షాపులు, మెకానిక్ షెడ్లల్లో పనులు చేయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎల్విన్‌పేట ఎస్‌ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు లక్ష్మి, పార్వతి, అంగన్వాడి, వైద్య సిబ్బంది ఉన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

సాలూరురూరల్ : మండల సర్వసభ్య సమావేశం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి అధ్యక్షతన సాదాసీదాగా ముగిసింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నిక నోటిఫికేషన్ సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరపడంలేదన్నారు. సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు ఏమైనా సమస్యలుంటే వైస్ ఎంపిపి రెడ్డి సురేష్‌తో చర్చించాలని తెలిపారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన తోణాం, బాగువలస వైద్యాధికారులకు సభ్యులకు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాములమ్మ, వైస్ ఎంపిపిలు సువ్వాడ గుణవతి, రెడ్డి సురేష్, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

లిప్ కార్యక్రమంపై పరిశీలన

గుమ్మలక్ష్మీపురం : జిల్లాలో లిప్ (లెర్నింగ్ ఇంపార్టెంట్ ప్రోగ్రాం) అమలు తీరుపై రాష్ట్రస్థాయి బృందం పర్యటించింది. మూడు రోజుల పాటు పర్యటనలో భాగంగా ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల చదువు సామర్థ్యాలు గుర్తించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో భాగంగా సీతంపేట మండలం మల్లి, కురుపాం మండలం నీలకంఠాపురం ఆశ్రమ పాఠశాల, గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా పాఠశాల, భామిని లో జడ్పీహెచ్‌ఎస్, బత్తిలి, నులకజోడు గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించినట్లు బంద నాయకులు తిరుమల, చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి ఆర్ విజయ్ కుమారి, శ్రీకాకుళం జిల్లా డైట్ ఉపన్యాసకులు భారతమ్మ ఉన్నారు.

'జగనన్న రాక్షస పాలనను తరిమికొట్టాలి'

పాలకొండ రూరల్ : టిడిపి రాక్షసపాలన తరిమికొట్టాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జగనాసుర రక్తచరిత్ర బహిరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత కుటుంబాన్నే ఆదుకోని సిఎం రాష్ట్ర ప్రజలను ఏ విధంగా ఆదుకుంటారన్నారన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు వెన్నపు శ్రీనివాసరావు, సుంకరి అనీల్, అంపోలు శ్రీను తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పాలకొండ : నియోజకవర్గ అభివృద్ధికి కోసం తనకు సహకరించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి టిడిపి నాయకులను కోరారు. మంగళవారం మాజీ వైస్ ఎంపిపి సిఎల్‌నాయుడును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సిఎల్ నాయుడు సతీమణి, మాజీ సర్పంచ్ చొంగ రమాదేవితో కూడా మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని తనకు నాయకులంతా సహకరించాలని కోరారు. టిక్కెట్ ఇచ్చే విషయంలో కూడా పార్టీ అధిష్టానానికి వివరించాలన్నారు.

భద్రగిరి సిడిపిఒగా సుశీల దేవి

గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి ఐసిడిఎస్ సిడిపిఒగా సిహెచ్ సుశీలదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇన్చార్జి బాధ్యతలను దుడ్డుఖల్లు సెక్టార్ సూపర్వైజర్ ఈశ్వరమ్మ నిర్వహించారు. సుశీలాదేవి గతంలో ఇక్కడ సిడిపిఒగా విధులు నిర్వహించి ప్రాజెక్టు డైరెక్టర్‌గా అనంతపురం బదిలీ వెళ్లారు. అనారోగ్య కారణాల రీత్యా కొన్నాళ్ల పాటు సెలవు పెట్టి తిరిగి యధా స్థానంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

వీరఘట్టం : ధాన్యం కొనుగోలు చేయాలని మంగళవారం మండలం చలివేంద్రికి చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయకపోతే ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విఎఒకు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి డిఇసి మాత్రలు పంపిణీ

సీతానగరం : ఈ నెల 15,16,17 తేదీల్లో బోధకాలు, నులుపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు ఎంపిడిఒ బి.కృష్ణమహేష్ రెడ్డి అన్నారు. మంగళవారం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ఆశా వర్కర్ల ద్వారా మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 15, 16, 17 తేదీల్లో జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి జగన్మోహన్, సీతానగరం, పెదఅంకలాం వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, ఎం.ఉషారాణి, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : మండలంలో ప్రతి ఇంటికి ఫైలేరియా మాత్రలు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఎంపిడిఒ దేవకుమార్ అన్నారు. మక్కువ పిహెచ్‌సి వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఫైలేరియా మాత్రలు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి అమర్ సింహారెడ్డి ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఫైలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియాను నివారించే డిఇసి ప్రోగ్రాం ఈనెల 16,17 తేదీల్లో మందులు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జి.శ్రీహరిరావు, రాజులమ్మ, ఆరోగ్యకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి రోగులకు సంక్షేమ పథకాలపై అవగాహన

కురుపాం : హెచ్‌ఐవితో జీవిస్తున్న వారికి తప్పనిసరిగా వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు గూర్చి తెలుసుకోవాలని జిల్లా ఎయిడ్స్ ఐసిటిసి కౌన్సిలర్ గోపాలరావు అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల హెచ్‌ఐవితో ఉన్నటువంటి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు, వారి హక్కులు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాజిటివ్ నెట్వర్క్ ప్రెసిండెంట్ పద్మ, ఐసిటిసి కౌన్సిలర్ మోహనరావు, ఔట్రీచ్ వర్కర్ వెంకటరమణ, వైడిఒ ఔట్రీచ్ వర్కర్ గీతారాణి పాల్గొనడం జరిగింది.

నగర పంచాయతీలో 'ఇదేం కర్మ'

పాలకొండ రూరల్ : నగర పంచాయతీలోని 5,6,7,8 వార్డుల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నగర పంచాయతీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ వైపిపి పాలనలో పెరిగిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, రాష్ట్రకార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పాలకొండ పట్టణ, మండల అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, గండి రామినాయుడు, కౌన్సిలర్ అడపా బాబ్జీ, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కొమరాడ

వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. అనారోగ్యంతో గిరిజన మృతి చెందిన విషయమై తెలుసుకున్న ఆయన మంగళవారం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆయనతో పాటు డిప్యూటీ డిఎంహెచ్ఒ కూడా పాల్గొని ఉలిపిరిలోని వసతిగృహాన్ని సందర్శించి పలు విషయాలు తెలుసుకున్నారు. ముందుగా విద్యార్థులు ఉండే డార్మెటరీ సిక్ రూములను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వండే భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తక్షణమే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాలన్నారు. వసతిగృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత లోపాల వల్ల ఎక్కువగా అనారోగ్యాలు బారినపడే అవకాశాలు ఉన్నాయని, కావున ఎప్పటికప్పుడు వైద్య తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు కొన్ని విషయాలు చెప్పేందుకు భయపడతారని అలాంటి పరిస్థితి రాకుండా ఎప్పటికప్పుడు విద్యార్థులను కనిపెట్టుకొని ఆరోగ్య క్షేమం వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. వీరి పరిశీలనలో కెఆర్‌బి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, హెల్త్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయ లక్ష్మీకాంతం, వార్డెన్ కృష్ణవేణి తదితరులున్నారు.

విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరపాలి

గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఆశ్రమంలో గతంలో పనిచేసిన ఆరోగ్య సిబ్బంది తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పి.సురేష్ డిమాండ్ చేశారు. ఉలిపిరి ఆశ్రమం పాఠశాలను మంగళవారం పాఠశాలల సందర్శించి అనంతరం ఐటిడి పిఒకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్టం పరిహారం చెల్లించాలని, ఆశ్రమ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన విద్యార్థి మృతి చాలా బాధాకరం : సిపిఎం

ఉలిపిరి గిరిజన వసతిగృహంలోని గిరిజన విద్యార్థి సుమిత్ర మృతి చాలా బాధాకరమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం ఉలిపిరి పాఠశాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సుమారు 400మంది పైగా విద్యార్థులు చదువుతున్న ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంను ప్రభుత్వం నియమించకపోవడం దారుణమన్నారు. వార్డెన్ తమ సొంత ఖర్చులతో ఎఎన్ఎంను నియమించుకున్న రంటే గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో ఇంతకంటే ఉదాహరణ ఇంకేమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. కావున సుమిత్ర మృతిపై అధికారులు కూడా దర్యాప్తు చేయాలన్నారు. అలాగే సుమిత్ర కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు మండల నాయకులు నాయకులు మాణిక్యం ఉన్నారు.

అందరూ సహకరిస్తే సమస్య పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - వీరఘట్టం




రైతులతో మాట్లాడుతున్న జెసి ఆనంద్

అందరూ సహకరిస్తే సమస్య పరిష్కరించేందుకు తమ వంతు చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గడగమ్మలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలో భూ సర్వే నిర్వహించినప్పుడు 195 సర్వే నెంబర్లు ఉన్నాయని, వీటి ఆధారంగా సర్వే చేస్తే భూమి ఒక దగ్గర సర్వేనెంబర్ వేరే వారి పేరున వస్తున్నాయని ఈ అంశాన్ని గ్రహించిన సర్వేయర్లు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు జెసి తెలిపారు. మీరంతా సహకరిస్తే ఒకటి రెండు రోజుల్లో రీ సర్వే చేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులంతా సమ్మతించారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యను జెసికి వివరించగా, మీ గ్రామానికి జలజీవన్ మిషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభించి ఇంటింటికి తాగునీరందించనున్నారని తెలిపారు. గ్రామంలో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుని రైతులు కోరారు. జిల్లాలోని లక్ష్యం మించి ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన వాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని జెసి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్కడి నుండి తిరిగి ప్రయాణమైన జెసిని మార్గమధ్యలో కొట్టుగుమ్మడ రైతులు వాహనాన్ని ఆపివేసి ధాన్యం కొనుగోలు చేయాలని మొరపెట్టుకున్నారు. ఇక్కడ నుండి కత్తుల కవిటికి చేరుకున్న జెసి భూసర్వేను పరిశీలించి వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ చందక సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మీనాయుడు, శ్రీను, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

సాగుభూములు ఇవ్వాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్ద గెడ్డ జలాశయంలో సర్వం కోల్పోయిన మడవలస నిర్వాసితులకు సాగుభూములు ఇచ్చి ఆదుకోవాలని గ్రామ గిరిజనులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు సూకురు రామారావు, మాజీ ఎంపిటిసి సభ్యులు యరగడ గంగమ్మ మాట్లాడుతూ పూర్తిగా నిర్వాసితులమైన మా గ్రామానికి ఎటువంటి ఆదాయం లేకపోవడం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దగెడ్డ జలాశయంలో మా భూములన్నీ కోల్పోయిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం తమకు తురాయిపాడు, మడవలస గిరిజన గ్రామాల్లో 46 గిరిజన కుటుంబాలకు రెండు ఎకరాలు చొప్పున పట్టాలు ఇచ్చారన్నారు. సరాయివలస వద్ద భూమిని అధికారులు చూపగా, తామంతా కలిసి తుప్పలు, డొంకలు తొలగించి, చదును చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన గిరిజనులు మమ్మల్ని అడ్డుకుని తగిలేశారన్నారు. అప్పటి నుంచి దీనిపై అధికారులు ఎటువంటి బాధ్యత తీసుకోకుండా మమ్మల్ని గాలికి వదిలేశారన్నారు. భూమి లేక పట్టాలు పట్టుకొని ఎలా బతుకుతామని ప్రశ్నించారు. ఈ సమస్యపై తహశీల్దార్ కార్యాలయం వద్ద పలుమార్లు ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్లకు వినతులిచ్చినా స్పందించలేదన్నారు. ఇదే విషయాన్ని తమ గ్రామానికి ఇటీవల విచ్చేసిన డిప్యూటీ సిఎం రాజన్నదొరకు విన్నవించామన్నారు. ఇప్పటికైనా మా భూమి ఎక్కడుందో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టే చూపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు రెడ్డి పారమ్మ, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న ఎపిఒ ఎన్జీవో నాయకులు

సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఎపి ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు జివి కిషోర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు వివరించిన అనంతరం వినతి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియామకాలు జరిగి రెండేళ్లయినా ప్రభుత్వం నుంచి ప్రొహిబిషన్ డిక్లరేషనుకు ఉత్తర్వులు వచ్చినప్పటికీ జిల్లా అధికారులు సరైన సమయంలో స్పందించలేదని, రెగ్యులరైజేషన్ అవ్వకపోవడం వల్ల తక్కువగా జీతాలు వస్తున్న విషయాన్ని కలెక్టరుకు వివరించామన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి 2019లో నియామకం జరిగి కొన్ని ప్రత్యేక కారణాల వల్ల నేటికీ రెగ్యులరైజేషన్ అవని వారి ప్రతిపాదనలు వెంటనే తయారుచేసి ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారని అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వై.వి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు శంకర్రావు బి పుష్ప, సర్వే డిపార్ట్మెంట్ నాయకులు సుమన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఎఒకు వినతి పత్రం అందజేశారు. అనంరం నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ముఖ హాజరును నిలిపివేయాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆపాలని, సాలూరు మున్సిపాలిటీలో కార్మికుల జనవరి నెల జీతం, హెల్త్ అలవెన్స్ నేటికీ వేయలేదని, మూడు మున్సిపాల్టీల్లో ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారానికి సెల్ ఏర్పాటు చేయాలని, పార్వతీపురం, సాలూరులో కార్మికులకు గడిచిన మూడేళ్లుగా పాలకవర్గాలు నూనెలు, సబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, పట్టణాల విస్తీర్ణం పెరుగుతున్నా కార్మికుల సంఖ్యను పెంచడం లేదని, రిటైరవుతున్న, మరణించిన కార్మికుల స్థానంలో కొత్త కార్మికులను నియమించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సాలూరు కమిటీ అధ్యక్షులు టి.శంకర్రావు, పార్వతీపురం కమిటీ నాయకులు శంకరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు సిహెచ్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-పాలకొండ

జగనన్న అర్బన్ లేఅవుట్ కాలనీలో వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో హౌసింగ్ లబ్ధిదారులు, వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఉగాది నాటికి గృహప్రవేశాలు చేపట్టాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు సహకరించాలన్నారు. అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, హౌసింగ్ డిఇఇ ఆనందరావు, ఎఇ మాధవరావు తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

వీరఘట్టం : మండలంలోని కంబరకు చెందిన సకినాన చిన్నమ్మడు(70) కాలిపోయి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గ్రామస్తులు పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 12న ఉదయం వంట చేస్తుండగా చీర పైటు అంచు స్టౌవ్‌కు అంటుకోవడంతో తీవ్రమైన గాయాలపాలయ్యాడు. గ్రామస్తుల సహకారంతో పార్వతీపురం జిల్లా ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు. భర్త స్వామినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుల ధ్రువపత్రం ఇవ్వొద్దని వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురంలో బిసిలుగా కొనసాగుతున్న కొంతమంది ఇటీవల ఏనేటి కొండ, ఏనేటి కోన్స్ అనే కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇంతవరకు షెడ్యూల్ ఏరియాలో లేని వీరికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదని అదే గ్రామానికి చెందిన ఎస్‌టి కొండదొర సామాజిక వర్గానికి చెందిన వారు తహశీల్దార్ కె.రత్నకుమారికి మంగళవారం వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రస్తుతం స్థానిక సర్పంచ్‌గా కొనసాగుతున్న మండల సుమలత కురుపాం మండలం నుంచి ఏనేటి కోన్స్ అనే తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. గెలుపొందిన సంగతి తెలిసిందేనని ఈ విషయంపై కోర్టులో కేసు ఉందన్నారు. మండలం ఏర్పడి నుంచి నేటి వరకు ఎస్‌టి కొండ దొర అనే కుల ధ్రువీకరణ పత్రం మాత్రమే మంజూరు చేశారని, ఏనేటి కొండ, కానీ ఏనేటి కోన్స్ అనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేదని వారు తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల అధికారులు స్థానికంగా దర్యాప్తుల జరిపి తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని, ఇలా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. వీరి ఆందోళనకు సిపిఎం, టిడిపి నాయకులు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామారావు, రమణ, నారాయణరావు, దుర్గారావు, శ్రీనివాసరావు గంగన్న దొర, నీలకంఠం దొర, ఇతర గిరిజనులు సిపిఎం, టిడిపి నాయకులు గేదెల సత్యనారాయణ, మండల పెదపాపినాయుడు, రైతుకూలీ సంఘం నాయకులు మామిడి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



లే అవుట్లను పరిశీలిస్తున్న తహశీల్దార్

అక్రమ లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

కురుపాం : అక్రమంగా లేఅవుట్లు వేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ తెలిపారు. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చేసే మాయాజాలాన్ని వినియోగదారులు తిప్పికొట్టి వారికి కేటాయించిన పార్కులు, కాలువలు, రోడ్లు కాపాడుకున్నారు. ఈ వార్త ఇటీవల ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం కురుపాంలో గల సాయి బాలాజీ రియలేస్టేట్‌లో పార్క్, రోడ్స్, డ్రైనేజ్ ను కేటాయించిన స్థలాన్ని తహశీల్దార్ పరిశీలించారు. అక్రమ లే అవుట్లు వేసిన వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పూతికవలసలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములను పరిశీలించి, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాంలో వేసిన ప్రతి లే అవుట్లను పరిశీలించి అనుమతుల్లేకుండా లేఔట్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కొమరాడ : రైతు వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం కొమరాడలో ఎడ్ల బండితో ధాన్యం కుప్పల నుంచి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై కలెక్టర్‌కు, జెసికి వినతిని ఇచ్చినా స్పందించడం లేదన్నారు. వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారమిచ్చి లక్ష్యాన్ని అధిగమించామని చెబుతున్నార న్నారు. వాస్తవానికి ఎక్కడా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయలేదన్నారు. సంక్రాంతి నుంచి ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఇప్పటికే మిల్లర్లు, వ్యాపారులు గ్రామాల్లో బేరసారాలు చేస్తున్నార న్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి ఎటువంటి షరతుల్లేకుండా కనీసం ప్రభుత్వం చెప్పేలా కనీసం ఇ - క్రాప్ చేసిన ధాన్యాన్ని ప్రాప్తికైనా పూర్తిస్థాయిలో విచారణ చేసిన పేపర్ కొనుగోలు చేయాలని, లేకపోతే రానున్న కాలంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి మండలంలోని మూలిగూడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలం విద్యార్థిని, విద్యార్థులతో కలిసి సంజీవయ్య చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సరోజినీ నాయుడు జీవితం ఆదర్శనీయం

ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు, రచయిత్రి, నైటింగేల్ ఆఫ్ ఇండియా, కవి కోయిల సరోజినీ నాయుడు 144వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి బాల, బాలికలు ఘనంగా నివాళులర్పించారు.సరోజినీ నాయుడు జీవితం నేటి తరం విద్యార్థినిలకు, మహిళలకు ఆదర్శనీయమని సామల ఉద్బోధించారు.

సమస్యలపై ప్రతినిధులతో ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి - భామిని

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోట శాంతికుమారి మండల ప్రజా ప్రతినిధులతో మండలి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని, రబీ సీజన్లో రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బికె అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా వైద్య సేవలు అందించాలని, ఇటీవల ఒడిశా నుంచి వచ్చిన 6 ఏనుగులు మనుమకొండ ప్రాంతంలో సంచారిస్తున్నాయని, అలాగే పసుకుడిలో 4 ఏనుగుల గుంపు ఉందని, స్థానికంగా ఇటువంటి ప్రమాదం లేకుండా ఏనుగుల సమస్య పరిష్కారం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే వివిధ పనులు, పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని ఎంపిపి కి సూచించారు. మండలి ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహా చలం మాట్లాడుతూ మండలం ప్రతి ధాన్యం గింజ కొనుగోలుకు ఎంఎల్‌ఎ అధికారులతో మాట్లాడరని, ఎరువులు కొన్ని ఆర్ బి కె లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్ మజ్జి మోహన్‌బాబు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు, ఎంపిటిసి టి.అన్నాజీరావు, పత్తిక మురళి, సర్పంచ్‌లు కొండగొర్రి చంటి, నిమ్మల కేశవ, తమ్మారావు, కిల్లారి పాల్గుణ, తోఘరానా శ్రీను, ఆగతముడి రఘుపతి నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ బిరఘుపతి నాయుడు, గెల్లంకి రమేష్ ఉన్నారు.

మంచి అలవాట్లతో ప్రాణాంతక వ్యాధులు దూరం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గుండెపోటు, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు, నిరోధానికి మంచి ఆహారపు అలవాట్లు, సైక్లింగ్ యోగ వంటివి దోహదపడతాయని జెసి ఆనంద్ అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సిపురంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గ్రామంలో నిర్వహించిన సైకిల్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాణాంతక వ్యాధుల్లో కేన్సర్, గుండెపోటు, ఒబిసిటీ ముఖ్యమైనవని, వాటి నివారణకు వైద్యుల సూచనలతో పాటు వ్యక్తిగత ఆహారపు అలవాట్లు వ్యాయామం, యోగ, సైక్లింగ్ వంటి వాటిపై ప్రజలు ఆసక్తిని పెంచుకొని ఆచరించగలిగితే వాటి నిరోధానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో బందులుప్పి వైద్యాధికారి డాక్టర్ ఎం తిరుమల ప్రసాద్ జిల్లా వైద్య శాఖ సిబ్బంది వైద్యులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కేన్సర్ వ్యాధిపై కురుపాంలో సైకిల్లుతో అవగాహన ర్యాలీ



సీతానగరంలో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు, సిబ్బంది

చేపట్టారు. ఈ సందర్భంగా రావాడ రాంబద్రపురం, మాదలంగి పిహెచ్‌సి వైద్య అధికారులు పి. శ్రావణ్ కుమార్, కె.సుప్రియ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శంకర్రావు , సిఆర్పి నరేష్, పాఠశాల సిబ్బంది ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : వ్యాయామం, సైక్లింగ్, యోగాను దైనందిక జీవితంలో అలవాటు చేసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా కార్యక్రమంలో భాగంగా సీతానగరం లో వైద్య సిబ్బంది నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉషారాణి, ఎంఇఒ సూరిదేముడు, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులచే క్యాన్సర్ వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, నవోనమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్పీలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సంతమల్లి సమీపంలో నిర్వహిస్తున్న టెర్‌సింగ్ ఉపాధి పనులను మంగళవారం ఎంపిడిఒ గీతాంజలి పరిశీలించారు. ఎక్కువ వేతనాలు వచ్చేలా కొలతలు ఇవ్వాలన్నారు. అనంతరం మినీ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహారం వైఎస్సార్ పోషణ ఏ విధంగా అందుతుందో తెలుసుకున్నారు. అనంతరం కుసిమి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. రక్తహీనతపై సర్వే చేపట్టాలని ఎఎన్ఎంలకు ఆదేశించారు. అనంతరం కుసిమి ప్రాథమిక పాఠశాల సందర్శించారు. విద్యార్థులతో భోజనం చేసి సామర్థ్యం తెలుసుకున్నారు. కోడిశ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. ఆమెతో పాటు వైద్యాధికారి బి.రవీంద్ర, ఎపిఒలు సాగర్, బాబూరావు, కార్యదర్శులు రాజశేఖర్, వినోద్ తదితరులు ఉన్నారు.

పాలకొండ రూరల్ : మండలంలో ఎం.సింగుపురంలోని దుప్పాడ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎంపిడిఒ డొంక త్రినాథులు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనివేళల్లోనే పనులు చేపట్టాలన్నారు. అదే విధంగా కొలతలు ప్రకారం పనులు చేపట్టాలన్నారు.

వైద్యాధికారులతో సమీక్ష....

ఎం.సింగుపురం పిహెచ్‌సిలో మంగళవారం ఎంపిడిఒ డొంక త్రినాథులు వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందించాలన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ వైద్యసేవలు, సచివాలయాలు పరిధిలో మరింత ఎక్కువుగా విస్తరింప చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి కడియం చిరంజీవి తదితరులున్నారు.